క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భాద్రపద మాస శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఆనందం కనిపించెన్



వృద్ధులకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

మల్కాపురం: సామాజిక పింఛన్ల పంపిణీ ఆదివారం ఉత్సాహంగా సాగింది. వలంటీర్లు ఉదయమే లబ్ధిదారులకు ఇళ్లకు నగదు అందించారు. దీంతో వారి కళ్లల్లో ఆనందం కనిపించింది. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్ నగర్ ప్రాంతాలతో పాటు 58,59,60వ వార్డుల్లో ఆయా ప్రాంత వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు తమ బిడ్డ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇలా వలంటీర్లను పంపించారని వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయన చల్లగా ఉండాలని ఆశీర్వాదం అందించారు.

150 మందికి దంత పరీక్షలు



విద్యార్థినులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు త్రివేణీ, మూగి కీర్తి, తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల వద్ద ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. జీకే డెంటల్ క్లీనిక్ ఆధ్వర్యంలో వైద్యులు సి.హెచ్. త్రివేణీ, మూగి కీర్తి పాల్గొని సుమారు 150 మంది విద్యార్థినులకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

విద్యతోనే భాషా పరిజ్ఞానం



మాట్లాడుతున్న అనసూయాదేవి

మల్కాపురం: విద్యతోనే భాషా పరిజ్ఞానం పెరుగుతుందని, ఆలోచన శక్తి విస్తృతం అవుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తెలిపారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 'చదవడం మాకు ఇష్టం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ దగ్గరలోని గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ లభించే పుస్తకాలను చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో మేము సైతం ..

స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి ఆదివారం నిర్వహించిన ఏక్ తారీఖ్- ఏక్ గంట కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరిసరాలతో పాటు కార్యాలయాలు, బజార్ల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. హోదాలను పక్కను పెట్టి చీపుర్లు చేతపట్టారు.చెత్తా చెదారాలు స్వయంగా తొలగించి పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు.

- ఏక్ తారీఖ్-ఏక్ గంట శ్రమదానానికి విశేష స్పందన
- స్వచ్ఛభారత్‌లో అంతా పాల్గొనాలని జియ్యాని పిలుపు

విశాఖ విద్య: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జీవీఎంసీ అధికారులతో కలసి పరిసరాల పరిశుభ్రతపై కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. గ్రీన్‌బెల్ట్ పార్కు, వాకింగ్ ట్రాక్‌లను చీపుర్లు పట్టి శుభ్రం చేశారు. పార్కులోని వ్యర్థాలను ఏరి, చెత్త బుట్టల్లో వేశారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్-ఎకో వైజాగ్ 2023లో నగర ప్రజలంతా భాగస్వామ్యులు కావాలన్నారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఆయా కాలనీల ప్రజానీకంపై ఉందన్నారు. విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ చేస్తున్న కృషిలో ప్రతీ ఒక్కరి భాగస్వాములు కావాలని కోరారు. జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ , సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌లో శ్రమదానం

మర్రిపాలెం రైతు బజార్‌లో ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. బజారులో దుకాణాలు నిర్వహించే వారంతా కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. రైతు బజారుకు సమీపంలో చెత్తా చెదారం తొలగించారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్, అధికారులు



61వ వార్డులో శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ సుధ

- బీజేపీ నాయకుడు గొటివాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్నవాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు.

భాగస్వామ్యులు కావాలి

స్వచ్ఛత పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎన్ఎస్‌టీఎల్ డైరక్టర్ అబ్రహాం వరుగీస్ కోరారు. ఏక్ తారీఖ్-ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్‌టీఎల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఏడీ కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్ గేటు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గతేడాది చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాల్లో దేశ వ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీవో ప్రయోగశాలలన్నింటిలో విశాఖ ఎన్ఎస్‌టీఎల్‌కు మూడో స్థానం దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రతినిధులు ఏవీఎస్కే కుమార్, కల్నల్ రాహుల్ దీక్షిత్, కల్నల్ బీపీ ఆచార్య, మిథిలేష్ కుమార్ సాహు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం రైతు బజారులో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జోన్ 8 కమిషనర్ మల్లయ్య నాయుడు పాల్గొని రైతు బజారు ప్రాంతంలో చెత్తను సేకరించారు. వినియోగదారులకు, రైతులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన విశాఖనగరం, మన రాష్ట్రం పరిశుభ్రతలో ముందంజలో ఉండాలన్నారు. అనంతరం బాజీ జంక్షన్‌లో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులు పరిశుభ్రత పాటించాలని.. లేని పక్షంలో కఠినంగా వ్యవహరిస్తామని జెడ్సీ మల్లయ్య నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటరమణ, వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, బురెడ్డి గోపి, కంపర సత్తిబాబు, ఊటపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



గడ్డి తొలగిస్తున్న రైతు బజారు దుకాణదారులు

- జీవీఎంసీ 89వ వార్డులో జీవీఎంసీ అధికారులు, జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏక్ తారీఖ్- ఏక్ గంటా శ్రమదాన్ నిర్వహించారు. కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ పాల్గొని శ్రమదానం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏపీడీ శ్రీరామ్, జేడీ గ్రూప్ సభ్యులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంతో...

మల్కాపురం: స్థానిక సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పరిసరాలను హెచ్‌పీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పరిశుభ్రం చేశారు.

- జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పార్టీ నాయకులతో కలిసి రోడ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మిరెడ్డి,వార్డు నాయకులు కృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



పార్కులో చీపురు పట్టి ఊడుస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

- మల్కాపురం కృష్ణ రెస్టారెంట్ అండ్ బార్ వెనుక మార్గంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, నాయకులు మంగ, వెంటలక్ష్మి,చట్టి నూకరాజు,వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.
- 59వ వార్డు నక్కవానిపాలెంలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు పరిసరాలను శుభ్రం చేసి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.

చేయి చేయి కలిపారు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాలనీవాసులు శ్రమదానం చేసి రోడ్లు, కాలువలు, వీధులు, యూపీహెచ్‌సీ ప్రాంగణాలను పరిశుభ్రపరిచారు.

- జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు చోట్ల రోడ్లు, వీధులు, కాలువలు, చారిత్రక స్మారక చిహ్నాలు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, పార్కులను శుభ్రపరిచారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, ఇతర జీవీఎంసీ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు.

పరిసరాలు పరిశుభ్రం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులపేట, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో ఆదివారం వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఏక్ తారీఖ్.ఏక్ గంట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రతిజ్ఞ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, సచివాలయ శానిటరీ సెక్రటరీ ఆదారి నళిని తదితరులు పాల్గొన్నారు.



రైతు బజారులో శుభ్రం చేస్తున్న సభ్యులు



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న కార్పొరేటర్ లావణ్య, నాయకులు

- కంచరపాలెం పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్ విజయ నగర్ కాలనీ కేంద్రియ విద్యాలయం-2లో ఏకో వైజాగ్ 'స్వచ్ఛ సర్వేక్షణ్ సేవ'లో భాగంగా పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏఎన్‌డీ కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ అధికారులు, ఉద్యోగులు



బాజి జంక్షన్‌లో ర్యాలీ చేస్తున్న బెహరా భాస్కరరావు, జెడ్సీ మల్లయ్య నాయుడు



చంద్రనగర్‌లో శ్రమదానం చేస్తున్న అధికారులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు



40వ వార్డులో పరిసరాలను శుభ్రపరుస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



62వ వార్డులో వీధులను శుభ్రపరుస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు, జీవీఎంసీ సిబ్బంది

జోన్-5లో 89 శాతం పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో తొలి రోజు సుమారు 89 శాతం వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, యూసీడీ ఏపీడీ అధికారి పద్మావతి తెలిపారు. ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో ఆదివారం వలంటీర్లు ఆయా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారన్నారు. జోన్ పరిధిలో మొత్తం 26,929 మంది లబ్ధిదారులకు గానూ 24,059 మందికి ఇళ్ల వద్ద సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్ డబ్బులు అందించినట్లు చెప్పారు. ఇళ్లకే కాకుండా ఆస్పత్రులకు వెళ్లి పెన్షన్ అందజేశారన్నారు. సోమవారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్-5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు.



జోన్-5 గొల్ల కంచరపాలెంలో వృద్ధురాలి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీర్

భారీ అన్న సమారాధనలు

మల్కాపురం: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రకాష్‌నగర్, భీశెట్టి వారి వీధి వద్ద బాలమిత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సోమునాడు, 61,62వ వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, వార్డు పార్టీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్ వినాయకుడిని దర్శించుకుని అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో బాల మిత్రుల ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో నిర్వహించిన అన్న సమారాధనను వార్డు వైఎస్సార్‌సీపీఅధ్యక్షుడు గులిగిందల కృష్ణ ప్రారంభించారు.
- 60వ వార్డు గణేష్ మందిరం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.



ప్రకాష్‌నగర్‌లో అన్నప్రసాదాలు వడ్డిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మికి అభినందన

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బండారు వరలక్ష్మిని ఆదివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గోపాలపట్నంలో తన ఇంటి వద్ద ఘనంగా సత్కరించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు ఇంటింటికి ప్రచారం చేయాలని బెహరా సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, బండారు నాగేశ్వరరావు, కంపర కోటేశ్వరరావు, దవళ మోహన్, ఊటపల్లి గోవిందరావు, దొడ్డి రామచంద్రరావు పాల్గొన్నారు.

- పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఆళ్ల పైడిరాజుకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.



జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మిని సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు

వైద్య రంగానికి పెద్దపీట

సింధియా: సామాన్యులకు కూడా కార్పొరేట్ వైద్యం అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు.

ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ఆస్పత్రి సిబ్బందికి తినిపించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేటర్ నాగేశ్వరరావుకు కేక్ తినిపిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

ల్యాప్‌టాప్ వితరణ

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డుకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీను కుమార్తె గాయత్రికి టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు ఆదివారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఇంజినీరింగ్ చదువుతున్న ఆమెకు ఉపయోగార్థం ఈ ల్యాప్‌టాప్‌ను ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా అందజేసినట్టు లక్ష్మణరావు తెలిపారు.

40వ వార్డులో కొత్త పింఛన్ల అందజేత



నూతన పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీకి చెందిన పెంట్ల సాయికృష్ణ(12), కాకరలోవ బొబ్బిలివీధికి చెందిన ఇసై స్వరూప్(10)కు కొత్తగా మంజూరైన రూ.10 వేలు పింఛన్ నగదును ఆదివారం కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు పింఛన్ విషయమై వైఎస్సార్ సీపీ పశ్చిమ కన్వీనర్ ఆదారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా.. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పింఛన్ మంజూరయ్యేలా కృషి చేశారు. రాష్ట్రంలోని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోమని, నాటి వీరుల త్యాగ ఫలితాన్ని వృథాగా కానివ్వమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు ఆదివారం నాటికి 962వ రోజుకు చేరుకున్నాయి. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికుల పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

కార్మికుల జీతాలపై గుర్తింపు యూనియన్ నిర్లక్ష్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాల చెల్లింపుపై గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ నిర్లక్ష్యధోరణి అవలంభిస్తుందని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు ఆరోపించారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలాఖరున కార్మికులకు జీతాలు చెల్లించడం ఆనవాయితీ వస్తోందన్నారు. సెప్టెంబర్ నెలలో అమ్మకాలు, అడ్వాన్స్‌లు కలిపి రూ.2500 కోట్ల వ్యాపారం జరిగినా సకాలంలో జీతాలు చెల్లించకపోవడం యాజమాన్యం అలసత్వం కాగా దానిపై గుర్తింపు యూనియన్ స్పందించకపోవడం వారి ధోరణిని తెలియజేస్తోందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

కంచరపాలెం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్డీవో) డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని 24వ పోలింగ్ బూత్‌లో అత్యధిక సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను సత్కరించారు. మెట్టా సత్యనారాయణమూర్తి(82), బొడ్డేటి కొండమ్మ(81)తో పాటు ఆశవానిపాలెంలోని పోలింగ్ బూత్ నంబర్ 190కు చెందిన ఓటర్ సూరెడ్డి దేముడమ్మ(85)ను ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ, డిప్యూటీ తహసీల్దార్ సయ్యాద్ జిలానీ శాలువాలు కప్పి సత్కరించి అభినందించారు. ఓటర్ల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా మన రాజ్యాంగం వీలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వో కిషోర్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్పీపేట పాఠశాలలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

గోపాలపట్నంలో సీపీఎం బైక్ ర్యాలీ

గోపాలపట్నం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు గోపాలపట్నంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.జగన్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ బైక్ జాతా ద్వారా ప్రజల్ని భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీ గోపాలపట్నం బంక్ నుంచి బాజీ జంక్షన్, కాకానినగర్, చంద్రనగర్, కొత్తపాలెం, ఆర్‌ఆర్ వెంకటాపురం, నందమూరినగర్ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి. కుమార్, విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, బలివాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



గోపాలపట్నం బంక్ వద్ద బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నేరాల నియంత్రణపై అవగాహన

మల్కాపురం: నేరాలు జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడం కంటే ముందే అప్రమత్తంగా ఉండాలని మల్కాపురం సీఐ దేముడుబాబు అన్నారు. సీపీ రవిశంకర్ ఆదేశాల మేరకు ఆదివారం నేరాల నియంత్రణపై సీఐ అవగాహన సదస్సు నిర్వహించారు. అపార్ట్‌మెంటలు, షాపు యజమానులు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా నేరస్తులను గుర్తించడం సులభతరమవుతుందన్నారు. అంతే కాకుండా సీసీ కెమెరాలు ఉండడం వల్ల నేరాలు కూడా తగ్గుతాయన్నారు. ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాపురం పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న సీఐ దేముడుబాబు